క్లుప్తంగా

ముగిసిన చండీ హోమం



పుష్పాలంకరణలో మావుళ్లమ్మ అమ్మవారు

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామదేవత మావుళ్లమ్మ ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీచక్ర నవావరణ సహిత చండీ హోమం, ఇతర కార్యక్రమాలు సోమవారం ఘనంగా ముగిశాయి. విశ్వగాయత్రి హరిహర పీఠ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ విజయకుమారాచార్యులు ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు కలశలతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన జరిగింది.

ఆలయ హుండీల లెక్కింపు



అన్నవరప్పాడులో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

పెరవలి: అన్నవరప్పాడులో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీని సోమవారం అధికారులు, గ్రామ పెద్దల సహకారంతో తెరిచామని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ప్రధాన హుండీతో పాటు, ఉప ఆలయాల హుండీల ద్వారా ఆదాయం రూ.1,95,719 వచ్చిందని, 28 రోజుల ఆదాయమని చెప్పారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని, అదేవిధంగా ఆలయ గ్రామ కమిటీ, గ్రామ పెద్దల సహకారంతో ప్రతి శనివారం ఉచిత అన్న సమారాధన నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలసపూడి గ్రూప్ దేవాలయాల ఈఓ పి.మహేశ్వరరావు సమక్షంలో గ్రామ పెద్దలు పంతం చిన్న, పులపర్తి నాగరాజు, పంతం నాగేశ్వరరావు, యాళ్లబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న, ఓసూరి బాలనాగేశ్వరరావు, గుత్తుల మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాస్ పుస్తకాల మంజూరుతో రైతులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న యాళ్ల రామారావు

నిడదవోలు రూరల్: శంకరాపురం రెవెన్యూ పరిధిలోని రైతులకు పాస్ పుస్తకాల మంజూరుతో ఎంతో మేలు చేకూరిందని సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు అన్నారు. రావిమెట్ల–శంకరాపురం పీఏసీఎస్ మహాజన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ శంకరాపురం రెవెన్యూ పరిధిలోని పొలాలకు ఎంతో కాలంగా పాస్ పుస్తకాలు మంజూరు చేయకపోవడంతో రైతులంతా తీవ్రంగా నష్టపోయేవారన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గిద్దా వెంకటేశ్వరనాయుడు, సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, స్థానిక నాయకులు కాల్దారి శ్రీనివాస్, ఉప్పులూరి రామకృష్ణ, కత్తినొక్కుల మురళీకృష్ణ, యామన మాణిక్యాలరావు, సొసైటీ కార్యదర్శి పెద్దిశెట్టి ప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాస్ ప్రారంభం

ఉండ్రాజవరం: రైల్వేల అభివృద్ధికి కేంద్రం అధిక నిధులు మంజూరు చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. కాల్దారి గ్రామం వద్ద రూ.8.41 కోట్లతో నిర్మించిన రైల్వే అండర్ పాస్‌ను సోమవారం ఆయనతో పాటు సర్పంచ్ సీహెచ్ కుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టే నవీన్, పలువురు బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

క్రీస్తు దేవాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన



యర్నగూడెంలో క్రీస్తు దేవాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జయరావు పొలిమెర

దేవరపల్లి: యర్నగూడెంలో పునర్నిర్మిస్తున్న పునీత జాన్ మరియ వియాన్నీ దేవాలయానికి సోమవారం ఏలూరు పీఠాధిపతి రెవ. జయరావు పొలిమెర శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన నూతన దేవాలయాన్ని నిర్మించాలని సంకల్పించిన విచారణ కర్త ఫాదర్ దానియేలును అభినందించారు. శిథిల దేవాలయ ప్రతిమానమూనాలతో నూతన దేవాలయాన్ని నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఫాదర్ దానియేలు మాట్లాడుతూ 45 ఏళ్ల క్రితం గ్రామంలో ఆర్‌సీఎం చర్చిని నిర్మించినట్టు చెప్పారు. దేవాలయం శిథిలావస్థకు చేరడంతో కొత్తగా నిర్మిస్తున్నట్టు తెలిపారు. సర్పంచ్ బొంతా భరత్‌బాబు వంద బస్తాల సిమ్మెంట్ విరాళంగా ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు, పలువురు ఫాదర్లు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటే బాసటగా..

- మహిళల ఆర్థిక ప్రగతే ప్రభుత్వ లక్ష్యం
- వైఎస్సార్ సున్నా వడ్డీతో ఆర్థిక భరోసా
- నియోజకవర్గంలో 4,990 మందికి రూ.34.34 కోట్ల లబ్ధి

పెరవలి: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రవేశపెట్టారు. మహిళలు తీసుకున్న రుణానికి వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పిన ముఖ్యమంత్రి.. అందుకనుగుణంగా గత నాలుగేళ్లుగా వడ్డీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తూ వచ్చారు. నిడదవోలు నియోజకవర్గంలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంలో ఇప్పటివరకు నాలుగేళ్లుగా రూ.34.34 కోట్ల నిధులు మహిళలకు అందించారు. దీంతో తీసుకున్న అప్పునకు వడ్డీ భారం పడకుండా ఉండటంతో పాటు, వారు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నారు. ఇవేకాకుండా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా ద్వారా మహిళలకు రుణాలు ఇవ్వటం, గతంలో తీసుకున్న రుణాన్ని ప్రభుత్వమే చెల్లించటంతో మహిళలు ఆర్థిక ప్రగతికి బాటలు పడ్డాయి. డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన టీడీపీ ప్రభుత్వం.. తర్వాత ఆ మాటే మర్చిపోవటంతో మహిళలు ఆర్థికంగా నలిగిపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికల్లో నాలుగు విడతలుగా రుణ మాఫీ చేస్తామని, అలాగే సున్నా వడ్డీ అందిస్తామని హామీ ఇచ్చి, ఆ మాట ప్రకారమే నాలుగేళ్లుగా సున్నా వడ్డీ సకాలంలో చెల్లిస్తుండడంతో మహిళలకు ధీమా ఏర్పడింది. నిడదవోలు నియోజకవర్గంలో సున్నా వడ్డీ పథకంలో 4,990 మందికి రూ.34.34 కోట్లు లబ్ధి చేకూరింది. ఈ సొమ్ము నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయటంతో, వారి కుటుంబానికి ఆర్థికంగా చేదోడుగా నిలిచింది.

నాలుగేళ్లుగా పొందిన లబ్ధి ఇలా..

మండలం	గత నాలుగేళ్లు	లబ్ధిదారులు	సొమ్ము (రూ.కోట్లలో)
పెరవలి	2019–23	1,686	12.46
ఉండ్రాజవరం	2019–23	1,556	10.81
నిడదవోలు	2019–23	1,748	11.07
మొత్తం	2019–23	4,990	34.34



పెరవలిలో సున్నా వడ్డీ కార్యక్రమానికి హాజరైన మహిళలు (ఫైల్)

ఆర్థిక ఇబ్బందులు తొలిగాయి



వైఎస్సార్ సున్నా పథకం వల్ల ఆర్థిక ఇబ్బందులు తొలగటంతో పాటు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడింది. మహిళలు ఎంత రుణం తీసుకున్నా, వడ్డీ భారం ఉండదనే ధీమా ఏర్పడింది.

– తాడి శ్యామల, డ్వాక్రా మహిళ, పెరవలి

గతంలో ఇబ్బందులు పడ్డాం



గత ప్రభుత్వంలో సున్నా వడ్డీ సక్రమంగా పడకపోవటంతో అనేక ఇబ్బందులు పడ్డాం, ఈ ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి లేదు. నాలుగేళ్లుగా అన్న టైమ్‌కే సరిగ్గా పడుతున్నాయి.

– మానేపల్లి రత్నకుమారి, డ్వాక్రా మహిళ, పెరవలి

వడ్డీ భారం లేదు



టీడీపీ ప్రభుత్వంలో రుణ మాఫీ చేస్తానన్నారు. చేయలేదు. చేసిన అప్పునకు వడ్డీకి వడ్డీ వసూలు చేశారు. నేడు ఎంత అప్పు తీసుకున్నా వడ్డీ భారం లేకుండా ప్రభుత్వమే చెల్లిస్తోంది.

– కప్పుల కుమారి, డ్వాక్రా మహిళ, కాపవరం

ప్రజాసేవ చేసే వలంటీర్లందరూ వజ్రాలే..

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- వలంటీర్లకు ఘన సన్మానం



అచ్చన్నపాలెంలో వలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: రాష్ట్రంలో ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లందరూ వజ్రాలేనని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని వలంటీర్లకు సన్మాన కార్యక్రమం అచ్చన్నపాలెంలో ఉన్న కాకర్ల గంగరాజు కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం జరిగింది. సభకు జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మీవెంకటరత్నం అధ్యక్షత వహించగా, సర్పంచ్ జాలపర్తి సౌజన్య స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ వజ్రా అవార్డులు రాకపోయినా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లందరినీ వజ్రాల కంటే ఎక్కువగా గుర్తించి, గౌరవించారని, అంతకంటే ఏం కావాలన్నారు. వలంటీర్లపై జగనన్న ఏ నమ్మకం పెట్టుకున్నారో, చక్కటి ప్రజాసేవ చేస్తూ దానిని నిలబెట్టుకోవాలని కోరారు.

ప్రజల మన్ననలు పొందుతూ, నాయకులతో మమేకమై పనిచేయాలని సూచించారు. పెన్షన్ కోసం వచ్చే దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ స్లాట్ బుక్ చేసి వదిలేయకుండా, పెన్షన్ చేతికందే వరకూ సాయపడాలన్నారు. చేసిన సాయాన్ని లబ్ధి పొందిన వారు ఏ మాత్రం మర్చిపోరని, జీవిత కాలం గుర్తుంచుకుంటారన్నారు. వలంటీర్లు బాధ్యత వహించే గృహాలకు ఈ ఐదేళ్ల కాలంలో రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ లబ్ధి చేకూరిందని వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు ఆ లబ్ధిని గుర్తు చేయాలని వలంటీర్లకు సూచించారు. అనంతరం గ్రామాల వారీగా వలంటీర్లను శాలువాలు, సర్టిఫికెట్లతో సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, ద్వారకా తిరుమల ట్రస్టు బోర్డు మెంబరు తొమ్మండ్రు రమేష్, వైస్ ఎంపీపీ శివాజీ, నల్లజర్ల, పోతవరం సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పెండ్యాల హరేరామకృష్ణ, బంక అప్పారావు, వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, వామిశెట్టి పరమేశ్వరరావు, చేబ్రోలు చినవెంకటేశ్వరరావు, పిచ్చుకుల ప్రసాద్, ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి, పల్లి జ్యోతి, బొప్పన సత్తిరాజు, కఠారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పడమర చోడవరంలో రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి వనిత

రైతుల ఆనందమే సీఎం జగన్ లక్ష్యం

నల్లజర్ల: రైతుల కళ్లల్లో ఆనందం నింపడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని పడమర చోడవరంలో సోమవారం ఉదయం రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లను వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్‌తో కలసి మంత్రి వనిత ప్రారంభించారు. తూర్పు చోడవరంలో గన్నమని సుబ్బారావు తమ తల్లిదండ్రుల పేరిట నిర్మించిన డ్వాక్రా భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జాలపర్తి కల్యాణ మండపంలో నాయకులతో ఆత్మీయ సమావేశం జరిగింది. భోగవల్లి శ్రీరామారావు, రాజ్యలక్ష్మి, గన్నమని సుబ్బారావు, ఎంపీటీసీలు చోడసాని సునీత, జంగా లక్ష్మి,శ్రీనివాస్, కసుకుర్తి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తెలికిచెర్లలో గూడూరి శ్రీనివాస్‌తో కలసి గ్రామ శివాలయంలో మంత్రి వనిత ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. కల్యాణ మండపంలో మంత్రి వనిత ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జగనన్న పిలుపుపై రాజకీయాల్లోకి వచ్చానని, అందరికీ అందుబాటులో ఉండి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనను అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. సర్పంచ్ బండిచిట్టీ, ఉప సర్పంచ్ నక్కా పండు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుంచే విష్ణుమూర్తి, బుడిగిన వివి సత్యనారాయణ, నల్లా రాజారావు, మిద్దే పద్మారావు తదితరులు పాల్గొన్నారు. గుండేపల్లిలో సర్పంచ్ కలం ప్రసాద్ ఇంటి వద్ద ఆత్మీయ సమావేశం జరిగింది. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ జంగాలక్ష్మి,శ్రీనివాస్ కోరారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి వెంకటరత్నం, బంక అప్పారావు, వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, తొమ్మండ్రు రమేష్, మద్దిపాటి ప్రసాద్, చేబ్రోలు చినవెంకటేశ్వరావు, వామిశెట్టి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు భేష్!

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- కొవ్వూరులో వలంటీర్లకు వందనం



కొవ్వూరులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు హర్షణీయమని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలో లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో సోమవారం వలంటీర్లకు వందనం పేరిట మున్సిపాలిటీ, మండలంలో ఉన్న వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను తెచ్చారన్నారు. ప్రతి ఇంట్లో అర్హత ఉన్న వారికి సంక్షేమ పథకాలు చేరవేయడంలో వలంటీర్లు విశేష కృషి చేస్తున్నారన్నారు. వలంటీర్లకు శాలువాలు, సర్టిఫికెట్లు, మెడల్లతో సత్కరించారు. పట్టణంలో ఐదుగురికి సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న, 231 మందికి సేవా మిత్ర అవార్డులు అందజేశారు. మండలంలో 302 మంది వలంటీర్లలో ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవారత్న, 287 మందికి సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు సుంక సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, ముదునూరి సూర్యనారాయణరాజు, వెంపాటి సురేష్, గోలి శ్రీనివాస్ ఎంపీడీఓ కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రథ సారథులు వలంటీర్లు

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు



చివటం కమ్మ కల్యాణ మండపంలో పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



పెరవలిలో సేవా రత్నా అవార్డులు పొందిన వారితో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న వలంటీర్లు సంక్షేమ రథ సారథులుగా కీర్తి పొందారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పెరవలి దీపిక ఫంక్షన్ హాల్‌లో వలంటీర్ల వందనం కార్యక్రమంలో భాగంగా పెరవలి, మల్లేశ్వరం, అన్నవరప్పాడు, కడింపాడు, పిట్టల వేమవరం, ముక్కామల, ఖండవల్లి, నల్లాకుల వారిపాలెం, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, అజ్జరం గ్రామాల్లో విశిష్ట సేవలందించిన 389 మంది వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాల ప్రదానోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా వలంటీర్లు సేవలందించారని కొనియాడారు. నాలుగేళ్లుగా నియోజకవర్గంలో రూ.1,900 కోట్లతో అభివృద్ధి, సంక్షేమాన్ని అందించామని పేర్కొన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,300 కోట్లు, రోడ్లు, డ్రైన్లు, తాగునీటి వసతి, ప్రభుత్వ భవనాల ద్వారా రూ.300 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రాజకీయంగా టీడీపీ, జనసేన పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు మోసకారి అని, దోపిడీ ప్రభుత్వమని ఆరోపించిన పవన్ కల్యాణ్.. ఇప్పుడు టీడీపీ బుద్ధి ఏం మారిందని పొత్తు పెట్టుకున్నారని నిలదీశారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల ముందుకు వచ్చామని, మరోసారి తమను ఆశీర్వదించాలని రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ గుడాల శ్రీనివాస్ తెలిపారు. వలంటీర్లను సత్కరించి, అవార్డులు అందించారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దొడ్డిగర్ల స్వాతి పాల్గొన్నారు.

సంక్షేమ పాలనలో వలంటీర్లదే కీలకపాత్ర

ఉండ్రాజవరం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. చివటం గ్రామంలోని తణుకు బైపాస్‌లో ఉన్న కమ్మ కల్యాణ మండపంలో సోమవారం మండలంలో సేవలందిస్తున్న వలంటీర్లను ఆయన సత్కరించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా వలంటీర్లు వారి కుటుంబ సభ్యుల్లా తోడుంటున్నారన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, మండల జేసీఎస్ కన్వీనర్ కఠారు సిద్ధార్థరాజు, వైస్ ఎంపీపీలు నరహరిశెట్టి సరోజ, చెట్టే నవీన్, ఎమ్మెల్యే తనయుడు వరణ్ సాయి, ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాసు, మండల రైతు విభాగం అధ్యక్షుడు కోఠారు సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సుపరిపాలనను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పశివేదలలో గడప గడపకూ మన ప్రభుత్వం



పశివేదలలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరాలంటే రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. సోమవారం సాయంత్రం పశివేదల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం రెండో రోజు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకట్రావు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, స్థానిక సొసైటీ అధ్యక్షుడు వేములపల్లి రామారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు పరిమి సోమరాజు, ఆళ్ల శ్రీరంగనాథ్, వేములపల్లి పూర్ణచంద్రరావు, వేగి సూర్యారావు, ఉండవల్లి మునేశ్వరరావు, మాజీ సర్పంచ్ పరిమి వెంకట్రావు, దాసరి రాయుడు, బోడ సింగి తులసీ, నాయకులు తోట రామకృష్ణ, వెంపాటి సురేష్, కవల నాగేశ్వరరావు, ఎంపీడీఓ కె.సుశీల తదితరులు పాల్గొన్నారు.

మాలలకు టికెట్ కేటాయించాలి

దేవరపల్లి: రాబోవు ఎన్నికల్లో గోపాలపురం టీడీపీ టికెట్ మాల సామాజిక వర్గానికి కేటాయించాలని మాల మహానాడు నాయకుడు, నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతా దాస్ డిమాండ్ చేశారు. పల్లంట్లలో సోమవారం సాయంత్రం విలేకర్లతో మాట్లాడుతూ 40 ఏళ్లుగా గోపాలపురం టికెట్ ప్రతిసారీ మాదిగలకు కేటాయిస్తున్నారని, మాలలకు ప్రాతినిధ్యం ఉండడం లేదన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ టికెట్ మాలలకు ఇచ్చి సామాజిక న్యాయం చేయాలని కోరారు.

సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ మద్దిపాటి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

చాగల్లు: చంద్రవరం సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి కుటుంబాన్ని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు సోమవారం పరామర్శించారు. శ్రీరామమూర్తి కుమారుడు వినయ్ ఇటీవల మృతిచెందారు. వినయ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి, నివాళులు అర్పించారు. చంద్రవరం గ్రామంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి వినయ్ ఎంతో సేవ చేశారని కొనియాడారు. చిన్న వయసులో అకాల మృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే తలారి వెంట జెడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, కలవలపల్లి సొసైటీ అధ్యక్షులు గూడపాటి శివ, చిర్రి ప్రసాద్, మాజీ ఏఎంసీ చైర్మన్ వి.గంగాధర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డీఎల్‌పీఓగా నాగలత

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ)గా ఎం.నాగలత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె నరసాపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ రాజమహేంద్రవరం డీఎల్‌పీఓగా పనిచేసిన జేవీ సత్యనారాయణ నరసాపురానికి బదిలీ అయ్యారు. కాగా.. డీఎల్‌పీఓగా బాధ్యతలు చేపట్టిన నాగలతను కార్యాలయ సూపరింటెండెంట్, రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా సత్కరించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పుతున్న మంత్రి వనిత

నల్లజర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు ఆకర్షితులై తూర్పు చోడవరం టీడీపీ నాయకులు సోమవారం హోం మంత్రి తానేటి వనిత, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని మంత్రి వనిత, గూడూరి శ్రీనివాసరావు పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గన్నమని నాగేశ్వరరావు, అబ్బిన బాబూరావు, ఆలపాటి సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, బుడిగిన ఆదినారాయణ, ఆరేపల్లి రాజేష్, బత్తిన వెంకటేష్ ఉన్నట్టు పార్టీ నాయకులు గన్నమని సుబ్బారావు తెలిపారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి

ఉండ్రాజవరం: పోలియో మహమ్మారిని నిర్మూలించేందుకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ రాజనాల ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి మండల లెవల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ మార్చి మూడున నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 36 బూత్‌ల్లో ఐదేళ్ల లోపు వయస్సున్న పిల్లలందరికీ పోలియో చుక్కల మందు వేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది, ఆశా, గ్రామ వలంటీర్లు పాల్గొంటారని తెలిపారు.

సౌర విద్యుత్ పథకంలో సబ్సిడీ

గోపాలపురం: కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి సూర్యాఘర్ విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిడదవోలు ఎలక్ట్రికల్ డీఈ పి.వీరభద్రరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటిపైన మూడు కిలో వాట్ల సౌర పలకలు ఏర్పాటు చేస్తే, ఏడాదికి 4,730 యూనిట్ల కరెంటు ఉత్పత్తి అవుతుందన్నారు. పాతికేళ్లలో 85 టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించిన వారవుతారన్నారు. వినియోగదారులకు 40 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు.